క్లుప్తంగా

రేషన్ సరుకులు డీలర్లతో పంపిణీ

బేస్తవారిపేట: మండలంలోని రేషన్ కార్డుదారులకు జూన్ నెల నుంచి నిత్యావసర సరుకులు డీలర్ల ద్వారా పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ జితేంద్రకుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎండీయూ వాహనాలను ప్రభుత్వం నిలిపివేసిందని పేర్కొన్నారు. రేషన్ దుకాణం పరిధిలో 65 ఏళ్ల పైబడిన వృద్ధులు, దివ్యాంగులకు మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 గంటల మధ్య డీలర్ ద్వారా సరుకులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. రేషన్ దుకాణాల్లో ఉదయం 8 నుంచి 12 వరకు, సాయంత్రం 4 నుంచి 8 వరకు రేషన్ పంపిణీ చేస్తారని వివరించారు.

పోస్టల్ సేవలకు అంతరాయం



పోస్టాఫీసులో వేచి ఉన్న ఖాతాదారులు

గిద్దలూరు రూరల్: పట్టణంలోని హెడ్ పోస్టాఫీసులో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఆన్‌లైన్ సర్వర్ పనిచేయకపోవడంతో సేవలు నిలిచి ఖాతాదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొందరు ఖాతాదారులు క్యూలో నిల్చోలేక ఇంటికి వెళ్లిపోయారు.

మందుబాబులకు రూ.30 వేల జరిమానా

మార్కాపురం: మార్కాపురం పట్టణంలో ఇటీవల డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన ముగ్గురిని అరెస్టు చేసి మార్కాపురం కోర్టులో ప్రవేశపెట్టగా అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాసు మేజిస్ట్రేట్ ఎం.బాలాజీ ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున ముగ్గురికి రూ.30 వేల జరిమానా విధించినట్లు పట్టణ ఎస్సై సైదుబాబు తెలిపారు. ఓవర్‌లోడ్‌తో వెళ్తున్న ఆటోను సీజ్‌చేసి కోర్టులో హాజరుపరచగా 2,500 రూపాయల జరిమానా విధించారని చెప్పారు. వాహనదారులు మద్యం సేవించినా, ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

సచివాలయ స్థలం కబ్జాదారుడిపై చర్యలు తీసుకోవాలి



సబ్ కలెక్టర్‌కు అర్జీ ఇస్తున్న జయరాజ్

మార్కాపురం టౌన్: కంభం గ్రామ పంచాయతీ పరిధిలోని గ్రామ కంఠంలో సచివాలయం-4 నిర్మాణం కోసం కేటాయించిన స్థలాన్ని ఆక్రమించి, బేస్‌మెంట్‌ను ధ్వంసం చేసిన వ్యక్తిపై, సహకరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి ఎస్.జయరాజ్ సోమవారం మార్కాపురం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సబ్‌కలెక్టర్ వెంకట త్రివినాగ్‌కు అర్జీ అందజేశారు. సచివాలయ బేస్‌మెంట్‌ను ధ్వంసం చేసిన విషయమై కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేశామన్నారు. ఇప్పటికైనా సదరు వ్యక్తిపై చర్యలు తీసుకుని కోటి రూపాయలు విలువగల ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరారు. సబ్సిడీపై రైతులకు విత్తనాలు, మైక్రోఇరిగేషన్ పరికరాలు అందించాలని కోరుతూ ఏపీ రైతు సంఘం మార్కాపురం, యర్రగొండపాలెం నియోజకవర్గాల నాయకులు సబ్‌కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని, పెట్టుబడి సాయం అందించాలని సీపీఐ కార్యదర్శి అందె నాసరయ్య ఆధ్వర్యంలో అర్జీ అందజేశారు. కార్యక్రమంలో కొండయ్య, రామయ్య, కోటేశ్వరరావు, మాజీ కౌన్సిలర్ పెద్దన్న తదితరులు పాల్గొన్నారు. కాగా డివిజన్‌లోని వివిధ మండలాల నుంచి పలువురు అర్జీదారులు తమ సమస్యలపై సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రాలు అందజేశారు.

పుల్లలచెరువులో వర్షం



నీటితో కళకళలాడుతున్న రామన్నచెరువు

పుల్లలచెరువు: మండల కేంద్రం పుల్లలచెరువులో ఆదివారం రాత్రి రెండు గంటల పాటు భారీ వర్షం పడింది. దీంతో గ్రామాల్లోని చెర్వులు, కుంటలకు నీరు చేరాయి. ఆదివారం రోహిణీ కార్తె మొదలు కావడంతో ఎండలకు రోళ్లు పగలాలి అంటారు పెద్దలు. కానీ వర్షం జల్లులతో స్వాగతం పలికింది. పుల్లలచెరువులో ఎక్కువ వర్ష పాతం నమోదైంది. రైతులు పంట పొలాలను బాగు చేసుకునే వీలు కల్గుతుందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పశువులకు తాగేందుకు, మేతకు ఇబ్బంది లేదని పశుపోషకులు పేర్కొంటున్నారు. పుల్లలచెరువులో కాటివీరన్నచెర్వు, రామన్నచెర్వులకు ఒక మోస్తరు నీరు చేరింది. కవలకుంట్లలోని చెర్వుకు కూడా నీరు చేరడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ప్రతిఒక్కరికీ యోగా అత్యవసరం

- కలెక్టర్ తమీమ్ అన్సారియా
- మల్లవరం వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో యోగాలో పాల్గొన్న కలెక్టర్, అధికారులు



యోగా సాధన చేస్తున్న కలెక్టర్, జేసీ, ఎమ్మెల్యే, పలు శాఖల అధికారులు, సిబ్బంది

మద్దిపాడు: నేటి ఉరుకులు, పరుగుల జీవన విధానంలో ప్రతి వ్యక్తికీ యోగా అత్యవసరమని కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. యోగాంధ్ర-2025లో భాగంగా జిల్లా యంత్రాంగం మద్దిపాడు మండలంలోని మల్లవరం వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద సోమవారం నిర్వహించిన యోగా కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇక్కడున్న ప్రశాంతమైన వాతావరణం యోగా చేసేందుకు ఎంతో అనుకూలమని అన్నారు. ఒత్తిడితో కూడిన నేటి ప్రపంచంలో యోగా సాధన వలనే మనశ్శాంతి లభిస్తుందన్నారు. అందువలన ప్రతిఒక్కరూ వ్యక్తిగతంగా ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి యోగా సాధన చేయాలని ఆమె సూచించారు. యోగా వలన కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరిస్తూ వారిలో యోగా పట్ల ఆసక్తి పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నెలరోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణకు చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. అందులో భాగంగా ప్రజలకు శిక్షణ ఇచ్చేందుకు మాస్టర్ ట్రైనర్లను గుర్తించి వారికి కూడా ప్రత్యేకంగా అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. యోగాను ప్రతిఒక్కరూ జీవితంలో భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ మాట్లాడుతూ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేలా నెల రోజులపాటు నిర్వహించే కార్యక్రమాలలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. జూన్ 21వ తేదీ 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జిల్లాలో 10 లక్షల మంది యోగాసనాల్లో పాల్గొనే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ వెంకటేశ్వర్లు, డీఈఓ కిరణ్‌కుమార్, ఒంగోలు ఆర్డీవో లక్ష్మీప్రసన్న, జిల్లా ఆయుష్ అధికారి బైద్యనాథ్, సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్, సీనియర్ మెడికల్ ఆఫీసర్లు పద్మావతి, శిరీష, ఆలయ ఈవో దామా నాగేశ్వరరావు, స్కూల్ గేమ్స్ సెక్రటరీ హజీరాబేగం, పతంజలి యోగా సంస్థ ప్రతినిధులు సుధీర్, రవి, గుప్తా, నాగేశ్వరరావు, స్థానిక తహసీల్దార్ నారాయణరెడ్డి, ఎంపీడీవో డీఎస్‌పీ ప్రసాద్, రెవెన్యూ, పంచాయతీ, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, వైద్య శాఖల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్లు అందుబాటులో ఉండాలి



రేషన్ డీలర్లతో మాట్లాడుతున్న తహసీల్దార్ నారాయణరెడ్డి

మద్దిపాడు: రేషన్ డీలర్లు లబ్ధిదారులకు అందుబాటులో ఉండాలని మద్దిపాడు తహసీల్దార్ నారాయణ రెడ్డి సూచించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్లకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. జూన్ నెల నుంచి రేషన్ డీలర్లు నేరుగా లబ్ధిదారులకు రేషన్ అందించాలన్నారు. ప్రతి నెలా ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు షాపుల వద్దనే లబ్ధిదారులకు అందుబాటులో ఉండి రేషన్ అందించాలన్నారు. మధ్యాహ్న సమయంలో 12 నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు వికలాంగులు, వృద్ధులకు ఇంటి వద్దకే రేషన్ సరఫరా చేయాలన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ ప్రతి డీలరు స్టాక్ రిజిస్టర్ నిర్వహించాలని, బోర్డులు ఏర్పాటు చేసి సరుకు నిల్వ నమోదు చేయాలని చెప్పారు. దాంతో పాటు డీఎస్‌ఓ, తహసీల్దార్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీల నంబర్లను బోర్డుపై ప్రదర్శించాలని ఆదేశించారు. తూకం రాళ్లు లేనివారు, తూనికలు, కొలతల శాఖల వారి ద్వారా రాళ్లు తీసుకుని వాటిని సర్టిఫై చేయించుకోవాలన్నారు. ఒకటో తేదీ నుంచి జిల్లా స్థాయి అధికారులు ప్రతి డీలర్ షాపునకు తనిఖీలకు వచ్చే అవకాశం ఉందన్నారు. డీలర్లు ఎటువంటి అవకతవకలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రేషన్ దుకాణాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, జూన్ ఒకటో తేదీ పండుగ వాతావరణంలో ప్రజాప్రతినిధుల ద్వారా రేషన్ సరఫరా చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ వంశీ, ఆర్‌ఐ రమణయ్య, సీనియర్ అసిస్టెంట్ నాగేశ్వరరావు, మండలంలోని రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

మిట్టమీదపాలేన్ని సందర్శించిన న్యాయవాదుల బృందం



గ్రామస్తులతో న్యాయవాదుల బృందం

సంతనూతలపాడు: మండలంలోని మైనంపాడు పంచాయతీ పరిధిలో గల మిట్టమీదపాలెం గ్రామాన్ని సోమవారం జిల్లా న్యాయవాదులు బృందం సందర్శించింది. ఈ సందర్భంగా జిల్లా న్యాయసేవాధికార సంస్థ ప్యానల్ అడ్వకేట్ డాక్టర్ నూకతోటి రవికుమార్, పారా లీగల్ వలంటీర్ పాటిబండ్ల సతీష్ మాట్లాడుతూ ప్రజలు శాంతియుతంగా సమస్యలు లేకుండా కలిసిమెలిసి జీవించాలని కోరారు. జిల్లా న్యాయసేవాధికారి సంస్థ ఆధ్వర్యంలో ఉచిత న్యాయం, లోక్ అదాలత్ ద్వారా కేసు రాజీ ప్రక్రియ చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆధార్ కార్డు లేని పిల్లలను గుర్తించాలన్నారు. ఆధార్ కార్డు ప్రాముఖ్యత, నమోదు గురించి ప్రజలకు వివరించారు. ఆధునిక యుగంలో మిట్టమీదపాలెం వివాద రహిత గ్రామంగా గుర్తింపు పొందడం హర్షనీయమని అన్నారు. గత కొంత కాలంగా ఈ గ్రామం వివాద రహితంగా నమోదైనట్టు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో మైనంపాడు వీఆర్‌ఓ పి.మధు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రంగసాయిపురంలో...

చీమకుర్తి రూరల్: మండలంలోని గాడిపర్తివారిపాలెం సచివాలయం పరిధిలోని రంగసాయిపురం వివాద రహిత గ్రామంగా గుర్తింపు పొందిందని జిల్లా న్యాయసేవాధికార సంస్థ ప్యానల్ అడ్వకేట్ డాక్టర్ నూకతోటి రవికుమార్, పారా లీగల్ వలంటీర్ పాటిబండ్ల సతీస్ తెలిపారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ లిటిగేషన్ ఫ్రీ అవగాహన కార్యక్రమంలో భాగంగా సోమవారం రంగసాయిపురం గ్రామాన్ని వారు సందర్శించారు. వివాదరహిత గ్రామంగా రంగసాయిపురం ఎంపికవడం అభినందనీయమని అన్నారు. ప్రజలు శాంతియుతంగా కలిసిమెలిసి జీవించాలని, ఉచిత న్యాయం, లోక్ అదాలత్ ద్వారా కేసుల రాజీ ప్రక్రియ, ఆధార్‌కార్డ్ ప్రాముఖ్యత గురించి వివరించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, పెద్దలు పాల్గొన్నారు.

దళిత సంఘాల నిరశన ప్రదర్శన



నిరసన వ్యక్తం చేస్తున్న దళిత సంఘాల నాయకులు

ఒంగోలు వన్‌టౌన్: దళిత మంత్రి బాలవీరాంజనేయ స్వామి నియోజకవర్గం జరుగుమల్లి మండలం కె.బిట్రగుంటలో అంబేడ్కర్ జయంతి రోజు ఆయన చిత్రపటంతో ఊరేగింపు నిర్వహిస్తుండగా అగ్రకులాల వారు అడ్డుకున్నారని, దీనిపై పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని దళిత హక్కుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు మండిపడ్డారు. ఒంగోలు అంబేడ్కర్ భవన్ నుంచి కలెక్టరేట్ వరకు దళిత సంఘాల నాయకులు సోమవారం నిరశన ప్రదర్శన చేశారు. దళిత సంఘాల నాయకులు మాట్లాడుతూ గతంలో బుద్ధపూర్ణిమ సందర్భంగా బుద్ధుడి విగ్రహం ఊరేగింపు సందర్భంగా కూడా అగ్రవర్ణాలకు చెందిన వారితో పాటు ఎస్సై దళిత యువకులను బెదిరించి దూషించారన్నారు. ఈ సంఘటనలపై దళిత యువకులు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేయలేదన్నారు. కేసు నమోదు కాకుండా షాడో మంత్రి దామచర్ల అండ తమకు ఉందని అగ్రవర్ణాల వారు విర్రవీగుతున్నారని మండిపడ్డారు. సీఐ హజరత్తయ్య, ఎస్సై మహేంద్రలు అగ్రవర్ణాల వారి కొమ్ము కాస్తున్నారని ఆరోపించారు. విషయం పెద్దది కావడంతో కేవలం ఆరుగురిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు కాకుండా చిన్న, చిన్న సెక్షన్‌లతో కేసులు నమోదు చేశారన్నారు. జరుగుమల్లి ఎస్సైపై ఎస్సీ, ఎస్టీ చట్టం ప్రకారం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ప్రదర్శన అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చి న్యాయం చేయాలని కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో బి.రఘురాం, టి.అశోక్, ఏడుకొండలు, డి.అంజయ్య, ఎస్.రవి, ఓపీడీఆర్ సుధాకర్ పాల్గొన్నారు.

విద్యతోనే భవిష్యత్తుకు బంగారు బాటలు



పురస్కారాలు అందుకున్న విద్యార్థులు

చీమకుర్తి: విద్యతోనే విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోగలరని ఆర్‌డబ్ల్యూడీ ప్రాజెక్ట్ పీడీ విద్యాసాగర్ అన్నారు. విద్యార్థి దశ నుంచే ఉన్నత శిఖరాలకు ఎదిగేందుకు ప్రణాళికలు వేసుకోవాలని పిలుపునిచ్చారు. పద్మశాలీయుల సేవా సంఘం ఆధ్వర్యంలో సోమవారం చీమకుర్తిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పదో తరగతిలో 500కుపైగా మార్కులు, ఇంటర్‌లో 900కుపైగా మార్కులు సాధించిన పద్మశాలీయ విద్యార్థుల ప్రతిభా నైపుణ్యాలను అభినందిస్తూ పురస్కారాలు, జ్ఞాపికలు అందించారు. ఈ సందర్భంగా పద్మశాలీయుల ఆరాధ్యదైవం యర్రాప్రగడ కోటయ్య విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో డాక్టర్లు గోపీకృష్ణ, కే వెంకటేశ్వర్లు, మున్సిపల్ చైర్‌పర్సన్ గోపురపు రాజ్యలక్ష్మి, కౌన్సిలర్లు సోమా శేషాద్రి, గోపురపు చంద్ర, పద్మశాలీయుల సంఘ నాయకులు దొంతు వెంకట్రావు, దోమల పుల్లయ్య, అవ్వారు ఆదినారాయణ, స్థానికులు పాల్గొన్నారు.

'కాకాణి' అరెస్టు అప్రజాస్వామికం

- మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి

మార్కాపురం: మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అరెస్టు అప్రజాస్వామికమని, మైనింగ్ విషయంలో ఆయనకు ఎలాంటి సంబంధం లేకపోయినా ఎవరో ఇచ్చిన అబద్ధపు వాంగ్మూలం ఆధారంగా అరెస్టు చేయడం దుర్మార్గమని వైఎస్సార్ సీపీ నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు, మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో ఖండించారు. మైనింగ్ విషయంలో నమోదైన కేసుపై కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఇప్పటికే న్యాయస్థానంలో సవాలు చేశారని, ఆ కేసులో బెయిల్ రాకుండా అడ్డుకునేందుకు అరెస్టు కుట్రను అమలు చేశారని దుయ్యబట్టారు. అరెస్టు సమాచారం గోప్యంగా ఉంచడం చట్టవిరుద్ధమని, పోలీసు బాధ్యతా రహితంగా వ్యవహరించడం సరికాదన్నారు. తమకు గిట్టని వారిపై అక్రమ కేసులు నమోదు చేస్తూ కూటమి ప్రభుత్వం దుస్సంప్రదాయానికి తెరతీసిందని మండిపడ్డారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వస్తే వేధింపులకు పాల్పడినవారు బయట తిరిగే పరిస్థితి కూడా ఉండదని హెచ్చరించారు. టీడీపీ నేతల అక్రమాలు, దుర్మార్గాలను ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదైనా ఒక్క హామీ కూడా సక్రమంగా అమలు చేయలేదని, దీని నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే నెలకో కొత్త నాటకం తెరపైకి తెస్తున్నారని మండిపడ్డారు.

మహిళపై కత్తితో దాడి

గిద్దలూరు రూరల్:

మహిళపై కత్తితో దాడి చేసిన వ్యక్తిపై సోమవారం కేసు నమోదు చేసినట్లు గిద్దలూరు సీఐ కె.సురేష్ తెలిపారు. సీఐ కథనం ప్రకారం.. మండలంలోని లింగాపురం గ్రామానికి చెందిన జడపోగు సుధారాణికి అదే గ్రామానికి చెందిన కసిరెడ్డి తరుణ్ అనే వ్యక్తి మధ్య ఆర్థిక లావాదేవీల విషయమై ఘర్షణ తలెత్తింది. దీంతో సుధారాణిపై తరుణ్ కత్తితో దాడి చేసి గాయపరిచాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కూటమి ప్రభుత్వంలో రైతులు కుదేలు



కంభంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కేపీ నాగర్జునరెడ్డి

- వైఎస్ జగన్ పొదిలి పర్యటనను విజయవంతం చేద్దాం
- మాజీ ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

కంభం: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత పొగాకు రైతులకు కష్టాలు మొదలయ్యాయని, అప్పు చేసి పంటలు సాగు చేసిన రైతులకు గిట్టుబాటు ధర దక్కక నష్టాలపాలవుతున్నారని వైఎస్సార్ సీపీ గిద్దలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. సోమవారం రాత్రి కంభంలో అర్ధవీడు, బేస్తవారిపేట, కంభం మండలాల వైఎస్సార్ సీపీ నాయకులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కేపీ నాగార్జునరెడ్డి మాట్లాడుతూ.. కూటమి పాలనలో పెట్టుబడి సాయం అందక, బీమా ఇవ్వక, పంటలకు గిట్టుబాటు ధర లేక పోవడంతో రైతులు అప్పుల పాలవుతున్నారన్నారు. వైఎస్సార్ సీపీ హయాంలో పండగలా ఉన్న వ్యవసాయం ఏడాది వ్యవధిలోనే కుదేలు కావడం కూటమి సర్కారు తీరుకు అద్దం పడుతోందన్నారు. పొగాకు రైతుల సమస్యలు తెలుసుకుని, వారి గొంతుకను ప్రభుత్వానికి వినిపించేందుకు వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 28వ తేదీన పొదిలి వేలం కేంద్రం సందర్శనకు వస్తున్నారని పేర్కొన్నారు. జగనన్న పర్యటను విజయవంతం చేసేందుకు రైతులు, పార్టీ శ్రేణులు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కంభం, అర్ధవీడు మండల పార్టీ అధ్యక్షులు గొంగటి చెన్నారెడ్డి, శ్రీధర్ రెడ్డి, బేస్తవారిపేట ఎంపీపీ ఓసురారెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ నెమలిదిన్నె చెన్నారెడ్డి, నాయకులు చేగిరెడ్డి ఓబుల్‌రెడ్డి, రవికుమార్, సబ్బసాని సాంబశివారెడ్డి, సయ్యద్ ఖాసిం, రసూల్, సుబ్బారెడ్డి, చలువాదిరమణ, పెద్దకోటేశ్వరరావు, భాస్కర్‌రెడ్డి, హుస్సేన్ బాషా, గురుమూర్తి, హుస్సేన్‌బాషా, రఫీ, ఆనంద్, రసూల్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అన్నా రాంబాబు, పక్కన షంషేర్ ఆలీబేగ్, నాయకులు

వైఎస్ జగన్ పోరుబాటను విజయవంతం చేద్దాం

- వైఎస్సార్ సీపీ శ్రేణులకు మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు పిలుపు

మార్కాపురం: పొగాకు రైతుల సమస్యలు తెలుసుకుని, వారికి అండగా నిలిచేందుకు ఈ నెల 28వ తేదీ ఉదయం 9.30 గంటలకు వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పొదిలి పొగాకు వేలం కేంద్రానికి వస్తున్నారని ఆ పార్టీ మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు పేర్కొన్నారు. వైఎస్ జగన్ పోరుబాటను విజయవంతం చేసేందుకు నియోజకవర్గంలోని రైతులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు పొదిలికి తరలిరావాలని పిలుపునిచ్చారు. సోమవారం మార్కాపురం పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పట్టణ కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో అన్నా రాంబాబు మాట్లాడారు. ఉదయం 8.30 గంటలకల్లా పొదిలికి చేరుకుని జగనన్నకు స్వాగతం పలుకుదామన్నారు. క్రమశిక్షణతో మెలిగి, రైతుల కష్టాలను జగనన్న దృష్టికి తీసుకెళ్దామని చెప్పారు. ఎన్నికలు ఎప్పుడొచ్చినా మళ్లీ జగనన్న సీఎం కావడం ఖాయమని, అప్పుడే ప్రజలు, కార్యకర్తల కష్టాలు తొలిగిపోతాయన్నారు. కార్యకర్తలకు అందుబాటులో ఉంటానని, ఎవరూ అధైర్యపడవద్దని భరోసా ఇచ్చారు. అధికారంలో ఉన్న ఐదేళ్లు వైఎస్ జగన్ ప్రజా సంక్షేమాన్నే చూశారని, పార్టీలు, కులాలు, మతాలు చూడలేదని, అర్హులైన అందరికీ పథకాలు అందించి ఆదుకున్నారని గుర్తు చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పొగాకు రైతులకు గిట్టుబాటు ధర దక్కేలా చర్యలు తీసుకున్నామని, కూటమి ప్రభుత్వంలో పొగాకు రైతులను నిండా ముంచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో ఏపీమైనార్టీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ షంషేర్ ఆలీబేగ్, ఏఎంసీ మాజీ చైర్మన్ గొలమారి శ్రీనివాసరెడ్డి, కోఆప్షన్ సభ్యురాలు గుంటక వనజాక్షి చెన్నారెడ్డి, డాక్టర్ చప్పల్లి కనకదుర్గ, పీఎల్‌పీ యాదవ్, పలువురు కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జిలు, పార్టీ ముఖ్యనాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్న పర్యటనకు తరలిరండి

కొనకనమిట్ల: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 28న పొదిలిలో పొగాకు వేలం కేంద్రం సందర్శనను విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల నాయకులు సోమవారం పలు గ్రామాల్లో ప్రచారం చేపట్టారు. మండలంలోని కొనకనమిట్ల, చింతగుంట, తువ్వపాడు, వాగుమడుగు, గనివానిపాడు, మునగపాడు, వెలగండ్ల గ్రామాల్లో ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణ, జెడ్పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలు, వైస్ ఎంపీపీ మెట్టు వెంకటరెడ్డి, మండల పార్టీ కన్వీనర్ మోరా శంకర్‌రెడ్డి, పార్టీ నాయకులు ఉడుముల గురవారెడ్డి పర్యటించారు. జగనన్న పోరుబాట కార్యక్రమానికి రైతులు తరలివచ్చి సంఘీభావం ప్రకటించాలని కోరారు.

పశ్చిమ ప్రకాశం వ్యాప్తంగా వర్షాలు



మార్కాపురం: పశ్చిమ ప్రకాశం వ్యాప్తంగా సోమవారం వర్షం కురిసింది. మార్కాపురంలో 27.2 మిల్లీమీటర్లు, పెద్దారవీడులో 36.4, దోర్నాలలో 16.4, యర్రగొండపాలెంలో 78.8, త్రిపురాంతకంలో 38.4, పుల్లలచెరువులో 76, కంభంలో 35.4, బేస్తవారపేటలో 20.4, అర్ధవీడులో 20.4, గిద్దలూరులో 18.2, రాచర్లలో 15, కొమరోలులో 12.4, తర్లుపాడులో 46.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. డివిజన్ వ్యాప్తంగా సగటున 34 మి.మీ వర్షం పడిందని అధికారులు తెలిపారు.

ఆపరేషన్ సిందూర్ అమరులకు ఘన నివాళి

బేస్తవారిపేట: ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన సందర్భంగా బేస్తవారిపేటలో మాజీ సైనికుల ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. తొలుత స్థానిక మాజీ సైనికుల సంక్షేమ సంఘ కార్యాలయంలో ఆపరేషన్ సిందూర్‌లో అమరులైన జవాన్లకు ఘన నివాళులర్పించారు. జమ్మూ కశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఉగ్రవాద దాడికి ప్రతీకారంగా పాకిస్తాన్ ఉగ్రవాద శిబిరాలపై భారత సైన్యం ప్రతిదాడి చేయడం హర్షణీయమన్నారు. దేశ సంక్షేమం కోసం తామంతా సిద్ధంగా ఉన్నామని, భారత్ మాతాకి జై అని నినదించారు. కార్యక్రమంలో మాజీ సైనికుల సంక్షేమ సంఘ అధ్యక్షుడు బొల్లా బాలిరెడ్డి, సంఘ నాయకులు పి.వెంకటరాజు, కేవీ రెడ్డి, ఖాశింవలి, రమణారెడ్డి, పాండు, వెంకటేశ్వర్లు, యల్లారెడ్డి, వెంకటరెడ్డి పాల్గొన్నారు.